భారత్ సమాచార్.నెట్
BHARATH SAMACHAR DIGITAL

6, సెప్టెంబర్ 2026, ఆదివారం  భారత్ సమాచార్

# వేగంగా పంట నమోదు పూర్తి చేయాలి: కలెక్టర్



**భారత్ సమాచార్, మెదక్ జిల్లా:** జిల్లాలో పంట నమోదు కార్యక్రమాన్ని వేగవంతంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ వ్యవసాయ శాఖ అధికారులను ఆదేశించారు. అలాగే మండల కేంద్రాల్లో యూరియా బుకింగ్ యాప్‌లో ఎలాంటి సాంకేతిక సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు. రైతులకు అవసరమైన ఎరువులు సకాలంలో అందేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని స్పష్టం చేశారు. ఈ మేరకు శనివారం కలెక్టర్ కార్యాలయంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారులతో గూగుల్ మీట్ ద్వారా సమీక్షా సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ ప్రతిమా సింగ్ మాట్లాడుతూ జిల్లాలో పంట నమోదు ప్రక్రియను వేగంగా పూర్తి చేయాలని అన్నారు. గ్రామాల్లో ఉన్న వాలంటీర్ల ద్వారా మాత్రమే పంట నమోదు కార్యక్రమాన్ని పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. రైతుల పంట నమోదు ప్రక్రియ జిల్లాలో ఇప్పటికే 75 శాతం పూర్తయిందని తెలిపారు. మిగిలిన ప్రక్రియను కూడా త్వరితగతిన పూర్తి చేసి, రైతుల వివరాలు సక్రమంగా నమోదు అయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

మండల కేంద్రాల్లో యూరియా బుకింగ్ యాప్ వినియోగంలో ఎలాంటి సాంకేతిక ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ సూచించారు. యాప్‌లో సమస్యలు ఏర్పడితే రైతులు ఇబ్బందులు ఎదుర్కొనే అవకాశం ఉన్నందున వాటిని వెంటనే గుర్తించి పరిష్కరించాలని అన్నారు. రైతులకు సరైన సమయంలో అవసరమైన యూరియా, ఇతర ఎరువులు అందేలా సంబంధిత అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు.

పంట నమోదు, ఎరువుల సరఫరా అంశాల్లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ ప్రతిమా సింగ్ సూచించారు. క్షేత్రస్థాయిలో ఎదురయ్యే సమస్యలను ఎప్పటికప్పుడు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించాలని అన్నారు. సమావేశంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి దేవ్‌కుమార్, వినయ్, వందనతో పాటు వ్యవసాయ శాఖకు చెందిన అధికారులు పాల్గొన్నారు.

© 2026 Bharath Samachar